# అట్టకోసం

★ అలపర్తి వెంకట సుబ్బారావు ★

వర్షం జోరుగా కురుస్తుంది. పాత శాల...రేకులు గప్పిన దగుట చేత వాన చినుకుల 'టప టప,' పాఠాలు చెప్పడానికి వీలులేకుండా చేసింది. అందుచేత, పిల్లలు వర్షాన్ని చూస్తూ సంతోషిస్తున్నారు. కాని, పంతులుగారి ధ్యానమాత్రం యింటి మీదనే వుంది.

అవును మరి...యీ వర్షానికి యిల్లంతా తడుస్తుంది. ఎన్ని బిందెలు పెట్టి నీరుపట్టినా లాభం లేదు. కాకపోయినా, కంత కొక బిందె తెచ్చి పెట్టగల సామర్థ్యం వుంటే తిరిగి యిల్లే కప్పించే పని. అందుచేతనే, పంతులుగారు... యింటిదగ్గర యిల్లాలు అనుభవించే యిక్కట్లనుగూర్చి ఆలోచిస్తూ కూర్చున్నారు.

ఇక...పిల్లలసంగతి సరే సరి! కాగితపు పడవలు నీళ్ళలో వదలాలని...గుడి ముందున్న గానుగ గుంటలోని నీళ్ళలో గంతులేయాలని...ఒకటేమిటి? ఎవరికి తోచినట్లు వారు కార్యక్రమాలు నిర్ణయించుకుంటున్నారు. కాని, కొట్టు సుబ్బయ్య కొడుకు 'రామం' మాత్రం...తను పుస్తకానికి వేసిన బొమ్మల అట్టను గురించి అప్పారావుకు అదేపనిగా చెబుతున్నాడు.

ఆ అట్ట చాలా అందంగా వుంది. అలాంటివే ఆ ఉదయం సినిమా వాళ్లు గోడలమీద అంటించి వెళ్లారు. కొట్టు సుబ్బయ్య, ఆ కాగితా లంటించే వాడికొక బీడీ ముక్కయిచ్చి, ఒక కాగితం పుచ్చుకున్నాడు. దాన్ని కొడుక్కిచ్చి పుస్తకానికి అట్టవేసుకో మన్నాడు. ఈ విషయమే రామం అప్పారావుకి పదేపదే చెబుతున్నది.

అప్పారావు మనస్సులోనూ, "నాకూ యిలాంటి అట్ట దొరికితే బాగుండునే!" అన్న వూహా జనించింది. కాని, "ఎలా దొరుకుతుంది?" అన్న ప్రశ్న వెనువెంటనే నిలచింది.

ఇంతలో వర్షపుజోరు తగ్గింది. అందువల్లనే ప్రక్కమేడలోని గోడ గడియారం కొట్టిన ఐదుగంటలూ పంతులుగారి చెవినిబడ్డాయ్! ఇంకేం! బడివదిలేశారు. పిల్లలు బయటికి పరుగుదీశారు.

## 2

చినుకులు పూర్తిగా తగ్గిపోయాయ్! చల్లగావుంది వాతావరణం. ఒక చేతిలో పలకా పుస్తకాలు పట్టుకొని, జారిపోతున్న లాగు మరో చేత్తో పైకి లాక్కొంటూ మెల్లిగా నడుస్తున్నాడు అప్పారావు.

దారిలో సుబ్బయ్య కొట్టును చూడగానే తిరిగీ అట్టవిషయం గుర్తొచ్చింది అప్పారావుకి. అలా దాన్ని గురించే ఆలోచించుకొంటూ పోతూవుంటే, లైబ్రరీ గోడమీద...వానకి తడిసి ఒకమూల లేచివున్న సినిమా కాగితం కనిపించింది. ఇంకేం! వెతకబోయిన తీగె కాలికి చుట్టుకున్నట్లయింది. అప్పారావు ఆనందానికి అంతులేదు.

"రేపు బడిలో రామానికి నా సాహసకృత్యం పదే పదే చెప్పాలి. లేకుంటే...వాడు మహా తనొక్కడికే అట్ట, ఉన్నట్టుగా కులుకుతున్నాడు. వెధవ అట్ట!...కాదు, వెధవ అట్టకాదు. మంచి చక్కని బొమ్మల అట్ట. రేపు నా పుస్తకానికి మాత్రం వెయ్యనా?" అనుకున్నాడు అప్పారావు, ఇక ఆ సినిమా కాగితం తనకు లభించినట్టుగానే.

అసలు...అప్పుడే ఆ అట్ట చించాలనుకున్నాడు, లేకుంటే ఎవరైనా చించుకెళ్తారేమోనని. కాని, లైబ్రరీలో గడ్డం తాత కూర్చొని వున్నాడు. అతను...లైబ్రరీ వూడ్చి శుభ్రం చేస్తుంటాడు. ఊళ్లో అన్నం అడుక్కు తెచ్చుకొని పొట్ట నింపుకొంటూ వుంటాడు. "ఆ కాగితం చించటం గడ్డంతాత చూశాడంటే కర్రదీసుకు వెంటబడతాడు. ఎందుకో అంత కడుపుమంట? లైబ్రరీముందున్న వేపచెట్టున

పుల్లలు విరువనివ్వడు. గుడి గోడల మీద ఎక్కి ఆడుకునే పిల్లలతో పోట్లాడతాడు. అవ లన్నీ తన సొంతమైనట్టుగానే పోట్లాడుతాడు. పాడు తాత!...కాని, తాత అంటే భయం లేకపోతే, ఈ పాటి కెవరో ఒకరు ఈ కాగితం చించుకెళ్లేవారే! చీకటి పడేటంతవరకు ఎవ్వరూ దాని జోలికి రాకుండా గడ్డంతాత కాపలా కాస్తాడు. ఇదీ ఒకిందుకు మంచిదే! చీకటిపడగానే వచ్చి ఆ కాగితం చించుకెళ్ళవచ్చు! పుస్తకానికి అట్టవేసుకోవచ్చు!!" ఇలా ఆలోచిస్తూ ఇంటికి వెళ్లాడు అప్పారావు.

ఒక వైపున ... గడ్డంతాత వున్నాడు గనుక ఫర్వాలేదులే అనుకొన్నాడు గాని...ఏమో ఎవరైనా చించుకెళ్తారేమో నన్న ఊహ మనస్సులో మెదలడంచేత, అమ్మపెట్టిన వేరుశెనగకాయలు జేబులో పోసుకొని, తిరిగి లైబ్రరీ దగ్గరికొచ్చి, అదేపనిగా గోడమీది సినిమా కాగితంకేసి చూస్తూ నిలుచున్నాడు అప్పారావు.

వానకి తడిసి, వూడిపోయిన సినిమాకాగితం అడుగుభాగం గాలికి వూగుతూవుంటే, "అందుకో నన్నందుకో!" అని తననే పిలుస్తుందని భావించి, ఆనందంతో "చీకటిపడనివ్వు!" అని మనస్సులోనే సమాధానం చెప్పుకొని ఇంటికెళ్లాడు అప్పారావు.

## 3

చీకటి పడింది. స్నానంకూడ చెయ్యకుండా గబగబ నాలుగు మెతుకులు తిని, "అమ్మా! రామంగారింటికెళ్లి చదువుకుంటానే!" అని తల్లినడిగాడు అప్పారావు. అందుకామె అంగీకరించింది. ఒక లాంతరు వెలిగించి ఇచ్చింది.

పుస్తకాలు చేతబట్టుకొని, లాంతరు తీసుకొని లైబ్రరీ దగ్గరికొచ్చాడు సరాసరి అప్పారావు. ఇంకా ఆగోడమీదికాగితం తనని రమ్మని పిలుస్తూనేవుంది. లైబ్రరీ లోకి తొంగిచూశాడు. గడ్డంతాత కనిపించలేదు." ఊళ్లోకి వెళ్లివుంటాడు అన్నంకోసం! ఇంకేం! వచ్చేలోగానే పని పూర్తి చెయ్యాలి!" అనుకున్నాడు. గబగబ తాడిచెట్టు ఎక్కసాగాడు, పుస్తకాలు...లాంతరు లైబ్రరీ అరుగు మీదపెట్టి.

వానకి తడిసి వుండటంచేత తాడిచెట్టు జారిపోతూవుంది. కాళ్ళకి పట్టు చిక్కడంలేదు. అదీగాక, కోతికొమ్మచ్చెలాడేటప్పుడు గోడ్లచావిట్లో స్తంబాలు పాకటంచేత నానుగాని...తాటిచెట్లెక్కడం అప్పారావుకిఅలవాటులేదు. కాని... పట్టుదలతో ప్రయత్నిస్తున్నాడు. చేతులు గీరుకుపోతున్నాయ్!

ఎలాగైతేనే:! సినిమా కాగితానికి దగ్గరదాకా వెళ్లాడు. అప్పటికే కాళ్లు గజగజ వణుకుతున్నాయ్! మరోప్రక్క ... గడ్డంతాత వస్తాడేమోనని భయంభయంగా వుంది. అలానే చెట్టును కావలించుకొని నలువైపులా చూశాడు. ఎవ్వరూ రావడం లేదన్న నమ్మకం దొరికాక, ఒక చేత్తో చెట్టును వాటేసుకొని రెండవచేతిని గోడవైపునకు చాపాడు. కాని, ఫలితం లేకపోయింది.

గాలి వీచినప్పుడు కాగితం అందుబాటుకొచ్చినట్టుగానే వుంటుంది. ఏం లాభం? అందటం లేదు. అంత చల్లగాలిలో కూడ అప్పారావుకి చెమటలు పోశాయ్. విసుగుపుట్టింది!! దుఃఖం వచ్చింది!! కాని, పట్టుదల సడలిపోలేదు. ఆఖరుసారిగా ప్రయత్నించాలనుకున్నాడు. ఇంకొంచెం ముందుకు వంగాడు. సినిమా కాగితం చేతికందింది. ఇంతలో ... గడ్డంతాత దగ్గుతూ లైబ్రరీకొచ్చాడు. ఆ దగ్గు వినిపించగానే భయంతో పట్టుదప్పిన అప్పారావు, నేలమీద పడి 'అమ్మా!' అని కేకవేశాడు. ఆ కేక విని గడ్డంతాత గబగబ పరుగెత్తుకొచ్చాడు. అప్పారావు గుప్పిట్లో...చినిగి వచ్చిన సినిమా కాగితం అలానే వుంది. అప్పారావుని యింటికి చేర్చాడు గడ్డంతాత.

## 4

ఆ మరునాడు గడ్డంతాత, అప్పారావుని చూడటానికి వెళ్లాడు. అప్పారావు మంచంమీద పడుకొనివున్నాడు. కాలికి పట్టువేసి వుంది. "ఏంబాబూ! ఎలావుంది?" అని అడిగాడు గడ్డంతాత.

గడ్డంతాతని చూడగానే అప్పారావు భయపడసాగాడు. ఇంతలో


కాశ్మీర్ శాలువ రు. 2/8-



96" × 56" సైజు ధర రు. 2/8- పోస్టేజీ రు. 1/2. సరకు పరిమితంగా ఉన్నవి. వెంటనే వ్రాయండి.

GENERAL SUPPLY CO,
P. B. 1360, (A. P. M.) Delhi.
కాతాదార్లు తమ అడ్రెస్ ఇంగ్లీష్‌లో వ్రాయాలి:

## ★ అట్టకోసం ★

అప్పారావు తల్లివచ్చి, "కూర్చో బాబాయ్!" అంటూ ప్రక్కనున్న కుర్చీ చూపించింది.

గడ్డంతాత కూర్చొని, "ఇంకా నయం! లేచినవేళ మంచిది. లేకుంటే, ఆశ ఏమైనా వుందా?" అంటూ సంభాషణ మొదలెట్టాడు.

"ఔను బాబాయ్! దేవుడు చల్లగా చూశాడు. కాలుబెణికింది. తోమించి, చింతగింజలవట్టు వేశాను." అన్నది అప్పారావు తల్లి.

"ఫర్వాలేదులే అమ్మా! కాకపోయినా, ఆ వెధవ సినిమా కాగితం ఎందుకు కావలసివచ్చింది చెప్పమ్మా?" అంటూ అప్పారావు వైపు తిరిగి "ఏంబాబూ! ఎందుకు నీకాసినిమాకాగితం" అని అడిగాడు గడ్డంతాత.

"పుస్తకానికి అట్టకోసం" అన్నాడు మెల్లగా అప్పారావు.

"అట్టకోసం అంత సాహసం చెయ్యాలా? అట్టలు వేసుకోటానికి యిక ఏ కాగితాలూ పనికిరావా బాబూ? కాకపోయినా, ఆ సినిమా వాళ్ళు అంటించి వెళ్లిన కాగితాలను మనం చించివేయడం ఏం న్యాయం!..."

"ఏదో...పిల్లలుగదు బాబాయ్! తెలియనితనం!" అన్నది అప్పారావు తల్లి.

"పిల్లలేకాదమ్మాయ్! పెద్దలైనా యింతే యీ రోజుల్లో. మొన్న...బండికోటయ్య, సినిమా వాళ్లు చెట్టుకి కట్టుకున్న తడికను కుడితిగాబుపై మూతగా పనికొస్తుందని తెచ్చుకున్నాడు. ఇంకా కొంతమంది...బొమ్మలమీద పేడ నుద్దలు విసరడం...వికార స్వరూపాలు తయారుచెయ్యడం పనిగా పెట్టుకుంటారు. వీళ్లంతాగూడ తెలిసైనా తెలియకనైనా సినిమావాళ్ళకి ద్రోహం చేస్తున్నవాళ్లే! సినిమా వాళ్ళు వాటికోసం ఎంతో డబ్బు ఖర్చుపెట్టాలిగదా! వీళ్ళు యిలా నాశనం చెయ్యడం ఏం న్యాయం?" అన్నాడు గడ్డం తాత బాధగా.

అప్పారావు శ్రద్ధగా ఆలకించాడు. ఆపైన దీర్ఘంగా ఆలోచించాడు. గడ్డంతాత చెప్పిన దానిలో చాలా సత్యం వుందనుకున్నాడు. తాననుకున్నట్టుగా గడ్డంతాత పాడు తాత కాదనుకున్నాడు. "ఒకరి కన్యాయం చెయ్యడంగాని, అన్యాయం జరుగుతూ వుంటే చూస్తూ మనకెందుకులే అని వూరుకోవటంగాని చేతగానివాడు గడ్డంతాత! అందుచేతనే; అన్నీ తన సొంతమైనట్టుగా సంచరిస్తాడు." అని గ్రహించాడు అప్పారావు.


## 1956-57లో నీభవిష్యత్తు



ఒక కార్డులో ఒక పువ్వుపేరు, మీ పేరు, అడ్రసు వ్రాసి పంపండి. మేము 1-4-0లకువి.పి.పిగా రాబోయే 12 మాసములకు మీ ఫలితాలు, వ్యాపార లాభనష్టాలు, ఉద్యోగ వివరాలు, మార్పులు, సంతాన వివరాలు సుఖజీవనము, దేహారోగ్యము వగైరాలు పలకటలకు తగిన ప్రతి చర్యలు పంపుతాము.

Mahalaxmi Jyotish Ashram,
Post Box 1355,(A.P.M)Delhi-6.


> రాజకీయ నాయకుడు రెండు గంటలసేపు ఉపన్యాసం ఇచ్చేసరికి గొంతుక బొంగురుపోయింది. ఇంకా మాట్లాడవలసిన విషయం రెండుగంటల పొడుగున ఉన్నది. కాస్త ఊపిరి పీల్చుకోడానికి ఆయన ఆగిన సమయంలో సభలోంచి ఒక శ్రోత కేక వేశాడు. "అయ్యా, ఈ పక్కనే గ్రామఫోన్ షాపు ఉంది. కొత్త పిన్ను తెప్పించమంటారా?" అని.

"అవును తాతా! నేను చేసినపని తప్పే! అందుకే దేవుడు నా కీశిక్ష విధించాడు. ఇక ఎప్పుడూ యిలాంటి పని చెయ్యను." అన్నాడు లెంపలేసుకొంటూ అప్పారావు.

"తప్పుచెయ్యని మానవుడులేడు బాబూ! కాని, ఆ తప్పును తెలుసుకున్నప్పుడు, దానినుంచి తప్పుకు తిరగడమే నీతి! ఇదిగో బాబూ! మంచి బొమ్మల అట్ట! ఇది లైబ్రరీకొచ్చే పత్రికలోనిది. నీకోసం తెచ్చాను. తీసుకో! నీకు అట్టలు కావలసివచ్చినపుడు నన్ను అడుగు. నేనిస్తాను. అంతేగాని, అట్టకోసం చెయ్యకు సాహసం!" అన్నాడు గడ్డంతాత అప్పారావు తల నిమురుతూ.

ఆప్యాయంగా అట్టను అందుకొని, "అలాగే తాతా!" అని, అప్పుడే తల్లి చేత పుస్తకం తెప్పించుకొని అట్టవేసి, పదేపదే చూసుకొంటూ మురిసిపోయాడు అప్పారావు. ★